# పాత బంగారం

భమిడి వెంకటేశ్వర్లు

ఉదయం ఆరుగంటలకే నిద్రలేవటం రామచంద్రంకి అలవాటు. రాత్రంతా తిరిగిన ఫ్యాను కట్టేసి, వీధి తలుపు తీశాక స్కూటరు వైపు, పక్కనే పెట్టిన చెప్పులని చూడటం అతని హాబీ. ఆ వైపు గట్టిగా నిట్టూర్చడం రివాజు. తన చెప్పులు ఎవరూ ఎత్తుకుపోరనే ధీమా లేకపోలేదు.

ఎందుకంటే, యిటీవల చెత్త వాడు కొందరి ళ్ళల్లో చెప్పులు ఎత్తుకుపోతున్న వార్తలు విన బడుతున్నాయి.

అయినా రామచంద్రం చెప్పుల్ని లోపల పెట్టటం లేదు - అతని చెప్పులకు కొన్ని ప్రత్యేకతలున్నాయి - పాతవి, చిరిగినవి, అయిరాదు చోట్ల కుట్లు, పైగా యడమ భాగంలో పావలా బిళ్ళంత చిల్లు!

తలుపు తీసి చూసిన రామచంద్రం ఆశ్చర్యపోయాడు. అక్కడ ఒకటే చెప్పు ఉంది! అందులో బాగున్న చెప్పు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించింది! రెండో చెప్పుకి పావలా సైజులో వున్న చిల్లు కావల్సి వచ్చిందా ఆ మహానుభావుడికి! అనిపించింది అతనికి. తనకన్నా దరిద్రుడా ఆ దొంగ వెధవ! మనసులో ఏవో ఆలోచనలు! గేటు తీస్తున్న చప్పుడు తనకు ఎంత నిద్రలోనైనా వినబడుతుంది. గోడ దూకి లోపల ప్రవేశించే కుక్కల విన్యాసాలూ తెలుసు. పైగా తలుపులు తీసి వాటిని తరమటం రామచంద్రంకి అలవాటే!

చెత్త బుట్టలో చెత్త అలాగే వుంది. అంటే చెత్తవాడు రాలేదనిపించింది. గేటు చప్పుడు కాలేదు.

అయినా చెప్పు మాయం అయింది. ఇంటి చుట్టూ





## డోంట్ కేర్

ప్రపంచ సుందరిగా ఎన్నికయిన ప్రియంకాచోప్రా ఇప్పుడిప్పుడే బాలీవుడ్ భామగా పేరు తెచ్చుకుంటుంది. నేను సుస్మితని ఆదర్శంగా తీసుకుంటానంటుంది. ఎందుకంటే సుస్మిత ఎవర్నీ లెక్క చెయ్యదు. తాను చెయ్యాలనుకున్నది చేసేస్తుంది. ఇండస్ట్రీకొచ్చాక అర్థమైంది ఈ ఇండస్ట్రీ ఎంత ప్రమాదకరమయిందో.... ఇక్కడి మాటల్ని పట్టించుకుంటే రోజుకోసారి ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. అందుకే 'ఐ డోంట్ కేర్ ఎనీ బడీ అంటోంది ప్రియాంక!' (మంచిదే.... పైకొచ్చే లక్షణాలే ఇవి!)

చూశాడు - కాని చెప్పు కనిపించలేదు. చెట్ల వెనుకా కనిపించలేదు.

అంతలో అనసూయ నిద్ర లేచింది.

విషయాన్ని భార్యామణికి వివరించాడు.

ఆ విషయాన్ని పట్టించుకోలేదు తేలిగ్గా కొట్టి పారేస్తూ అంది "చెప్పులు ఆరు నెలలకంటే ఎక్కువ వాడకూడదు. పోనీలెండి... ఇప్పటికైనా కొత్త చెప్పులు కొనుక్కోండి. మీకు ఎప్పట్నుంచో చెబుతూనే ఉన్నాను. ఆ చిరుగు చెప్పులతో యింకా ఎన్నాళ్లు తిరుగుతారు.'' అంటూ సుప్రభాతాన్ని వినిపించింది భార్యామణి.

"నీకేం.... ఎన్ని కబుర్లు అయినా చెబుతావు... ఇప్పుడు కొత్త చెప్పులకు ఎంత లేదన్నా రెండు వందల దాకా ఖర్చు చేయాలి.... అసలే బడ్జెట్ టైట్‌గా వుంది!''

అనసూయ మరోసారి చెప్పుల మీద బ్యాండు వేసింది. రామచంద్రంకి చిరాగ్గా వుంది. కోపంగా వుంది. అసహ్యంగా వుంది. అన్నింటికి మించి చెప్పులకు చేయవలసిన ఖర్చు తలచుకుంటుంటే గుండెలు అదిరాయి!

పాలు తీసుకొచ్చేందుకు బయలుదేరాడు రామచంద్రం. చెప్పులు లేకుండా ఎలా నడవటం అనుకుంటూ. మెట్ల కింద వున్న అట్ట పెట్టెలో కొన్ని పాత చెప్పులున్నాయి. వాటిలో ఏమైనా పనికొస్తాయేమోననిపించింది. ఆలస్యం చేయకుండా ప్రయత్నించాడు. పొద్దున్నే శ్రమ... టైము వేస్టు తప్ప ఫలితం కనిపించలేదు. మొత్తం మీద చెప్పులు లేకుండానే పాలకు బయలుదేరాడతను. రాళ్ళు గుచ్చుకుంటుంటే గిలగిలమన్నాడు. బాధ, బరువు ఏడుపుని ఆహ్వానించాయి. చాలా మంది చెప్పులు లేకుండా ఎలా నడుస్తున్నారో అర్థం కాలేదు. అన్నింటికీ మించీ ఏదైనా కాలులో గుచ్చుకుంటే ఎంత ప్రమాదం! అనిపించింది.

ఇరవై నిముషాలకు తిరిగి వచ్చాడు రామచంద్రం. వెయ్యి రూపాయల దుస్తులు ధరించాడు. పదహారు వేలు విలువగల రెండు ఉంగరాలు వేళ్ళకున్నాయి. పధ్నాలుగు వందలు ఖరీదు చేసే వాచీ వుంది. అన్నింటికి మించి పన్నెండు వేల జీతగాడు. ఇరవై లక్షలు ఖరీదు చేసే ఇంటి యజమాని! తను చెప్పులు లేకుండా నడుస్తుంటే ఎవరైనా చూస్తే ఎంత అవమానం! ఎంత చిన్నతనం! ఎవరివైపూ చూడకుండా తలొంచుకుని సిగ్గుపడుతూ పాలకు వెళ్ళివచ్చాడు రామచంద్రం.

ఇంటికి రాగానే కొత్త చెప్పులు ప్రస్తావన తీసుకొచ్చింది అనసూయ "సరేలే.... తప్పుతుందా ముందు బయటకు వెళ్ళాలంటే ఏవో చెప్పులుండాలిగా.... ఆ పాతవి కూడా ఏవీ సరిపోవటం లేదు'' చిరాగ్గా అన్నాడు రామచంద్రం.

"ఆవు పాలు తీసుకురండి'' అంది అనసూయ కాఫీ గ్లాసు అందిస్తూ.

"బాగుంది అసలే చెప్పు పోయిందని నేను ఏడుస్తుంటే రాళ్ళు గుచ్చుకున్నాయని మరోవైపు బాధపడుతుంటే - ఇప్పుడే ఆవు పాలు తేవాలంటావేంటి.... మళ్లీ రెండు ఫర్లాంగులు చెప్పుల్లేకుండా నడవాలి... పైగా చాలా మంది చూస్తారు అక్కడికొచ్చేవాళ్ళు అనవసరపు చర్చలతో విసిగిస్తారు. ఇప్పుడు ఏ ముండా కొడుకైనా చెప్పుల్లేవని క్లాసు తీసుకుంటే - ఇంతే సంగతులు... ఈ వేళకి ఆవు పాలు లేకుండా కథ నడిపించు....'' అన్నాడు చిరాగ్గా.

"ఓపని చేయండి'' అంది అనసూయ.

"ఏవిటి'' చటుక్కున అడిగాడు తను.

"లుంగీ కట్టుకుని వెళ్ళండి. నడిచేటప్పుడు ఎవరూ చూడరు. అక్కడికెళ్ళాక లుంగీని కింద కుంచుకోండి. అప్పుడు కాళ్ళకు చెప్పుల్లేవని ఎవరికీ తెలీదు..... కదలకుండా అలాగే నిలబడి,పాలు పోయగానే చటుక్కున బయలుదేరండి. ఎవరితోటీ యీవేళ కబుర్లాడకండి'' అని సలహా యిచ్చింది భార్యామణి.

"ఇటువంటి సలహాలు యిస్తారు కాబట్టే మిమ్మల్ని ఆడవాళ్ళు అన్నారు. మీకు ఎడాపెడా, పైనా కిందా కూడా తెలివి తేటలే! ఇక ముందూ వెనకా గురించి చెప్పక్కర్లేదు....'' అన్నాడు రామచంద్రం నవ్వుతూ.

అనసూయ ఆవుపాలు కోసం చెంబు యిచ్చింది. అతనికి వెళ్ళక తప్పలేదు. పాల దగ్గర జనం బాగానే వున్నారు. తెలిసిన వాళ్ళు, పరిచయస్థులు అయిదారుగురు కనిపించారు. అనసూయ సలహా ప్రకారం నడిచాడు అతను.

ఎనిమిదిన్నర అయింది టైము. స్నానం చేసి గుడికెళ్ళటం అలవాటు రామచంద్రంకి.

"చెప్పుల్లేవుగా.... గుడికెడతారా'' వెటకారంగా అడిగింది అనసూయ.

"తప్పదుగా.... నీ ఫార్ములా ఉందిగా...'' అన్నాడు.

రోడ్డు మీద నడుస్తుంటే తన కాళ్ళ వైపు చాలా మంది చూస్తున్నట్టుగా గమనించాడు రామచంద్రం ఏదో గిల్టీగా ఫీలయ్యాడు. కాళ్ళకు రాళ్ళు గుచ్చుకున్నా ఫరవాలేదు గాని, చూసిన వాళ్ళకు లోకువైపోతానన్న ఫీలింగు మాత్రం' అతన్ని వేధించసాగింది. గుడికెళ్ళేసరికి అక్కడ పది పన్నెండు జతల జోళ్ళు రోజూ లాగే కనిపించాయి. అలవాటుగా చెప్పులు విడిచేందుకు వెళ్ళాడు. అంతలోనే అదో ఫీలింగు! "వీటిల్లోంచి ఓ మంచి చెప్పుల జత వేసుకు పోతే'' అని దాదాపు ఇరవై రోజుల్నుంచి మనసు గోల చేస్తోంది. ఇది చాలా మంది చేసేదే! ఇప్పుడు తనకు చాలా అవసరం! పైగా యీ ఖర్చు నుంచి తప్పించుకోవాలంటే యిదే ఉత్తమ మార్గం! ఎవరు చూడొచ్చారు! అనసూయ, పిల్లలు కూడా యీ గుళ్ళో రెండు సార్లు కొత్త చెప్పులు పోగొట్టుకున్నారు! తను మళ్ళీ వారికి కొనలేదా! పైగా మంచీ చెడూ, నీతి, న్యాయం, ధర్మం గురించి ఆలోచించే వారికే ఎదురు దెబ్బలు... అవమానాలు, ప్లాట్‌ఫారంని బట్టి డైలాగులు, సీనుని బట్టి ప్రవర్తన మార్చేసుకునే వారికే అంతా బాగానే వుంటోంది కాలం!

ఇంట్లో వున్న ఒంటి చెప్పు గుర్తుకు రాగానే ఏడుపు వచ్చింది. పైగా చిరిగిన చెప్పు పోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఏడాది క్రితం నూట ఏభై రూపాయలు ఆ చెప్పులకు ఖర్చు చేశాడు. తన వద్ద చెప్పులు అంతగా అరగవు - స్కూటరుంది కాబట్టి. ఆఫీసులో కూడా చాలామంది ఉద్యోగుల్లాగా అనవసరపు నడక, వ్యవహారాలు నడపడు అయినా ఆరు నెలలకే బాగా అరిగిపోతాయి. ఆ తరువాత కొత్తవి కొనకుండా "రీసోలింగు'' చేయిస్తాడు. మరో రెండు మూడు నెలలకి అవీ అరిగిపోతాయి అప్పుడు "రీసోలింగు'' చేయించకుండా "ప్యాచ్‌లు''

వేయిస్తాడా రామచంద్రం.

"చెప్పుల మీద ఎక్కువగా, వృధాగా ఖర్చు చేసేవాడు పనికిరానివాడు" అని రామచంద్రం తాత అనేవాడు. వీలయినంత వరకూ తక్కువగానే. చెప్పుల మీద ఖర్చు చేయాలి. ఎంత ఎక్కువ ఖర్చు పెట్టినా చెప్పులు అరిగిపోతాయి. కాబట్టి హవాయి జోళ్ళతోనే గడపాలి. టైరు జోళ్ళు అయితే యింకా మంచిది. గొప్పలు, భేషజం చెప్పుల విషయంలో చూడకూడదు - రామచంద్రంకు యీ విషయాలు గుర్తున్నాయి. కానీ అంతగా విలువనిచ్చేవాడు కాదు చాలా కాలం వరకూ కానీ చెప్పుల మీద పెట్టుబడి, రిపేర్లు - చూస్తుంటే "ఇక తప్పదు" అనిపించేది.

"అన్నట్టు మరిచిపోయాను.... ఈవేళ గృహప్రవేశానికి వెళ్ళాలి. ఆఫీసుకి మధ్యాహ్నం వెడుదురుగాని" గుడి నుంచి యింటికి రాగానే చెప్పింది అనసూయ.

రామచంద్రం షాక్ తిన్నాడు. "అసలే చెప్పు పోయిందని నేనేడుస్తుంటే - గృహప్రవేశంకెళ్ళాలంటావేమిటి. ఇదో అదనంగా ఖర్చు. ఇప్పుడు వెళ్ళకపోతే ఏమయింది." చికాకు ప్రదర్శించాడు.

"బాగుంది వరస, ఆయన మన యిల్లు వెతుక్కుంటూ వచ్చి కార్డు యిస్తే చెప్పుల్లేవని మానేస్తే బాగుంటుందా."

"అయితే నీ హవాయి జోళ్ళు వేసుకుంటాలే" అన్నాడు రామచంద్రం.

"బాగుంది నా జోళ్ళు ఎదురింటావిడ తీసుకెళ్ళింది ఆవిడ జోళ్ళు తెగిపోయాయిట. కుట్టించడానికి టైము లేదుట" అంది అనసూయ.

"ఈ విషయం గుడికెళ్ళేప్పుడు చెబితే ఓ మంచి జత తెచ్చుకునేవాడిని కదా" రామచంద్రం అరిచాడు.

అతను ఆలోచనలో పడ్డాడు.

రామచంద్రంకి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ఇప్పుడు మనం స్కూటరు మీద గృహప్రవేశానికి వెళ్ళాలి. చెప్పుల్లేకుండా స్కూటరు ఎలా నడపాలి! పైగా స్కూటరు స్టార్టు చేసేందుకు, బ్రేకు మీద కాలు పెట్టేందుకు చెప్పులుండాలి... ఇప్పుడు గుడ్డిలో మెల్లలాగా, ఎడంకాలి చెప్పుపోయింది బ్రేకుకి, కిక్ కొట్టేందుకు కుడి కాలి చెప్పు ఉండనే ఉంది. ఆ ఒక్క చెప్పుతోటే యీవేళ కథ నడిపిస్తాను. అక్కడికెళ్ళాక చెప్పుల గురించి ఎవరూ ఆలోచించరు, చూడరు..." ఉభయ తారక మంత్రంగా చెప్పాడు రామచంద్రం.

మొగుడి తెలివి తేటలకు గర్వించాలో - ఏడవాలో అర్థం కాలేదు అనసూయకు.

పాత పెట్టెలో వున్న అతి పాత చెప్పులను కాళ్ళకు అలంకరించాడు రామచంద్రం.

గృహప్రవేశ భోజనం చేసి యింటి కొచ్చేసరికి ఒంటి గంట అయింది. అనసూయ భర్తకు రెండొందలు యిస్తూ "చెప్పులు కొనుక్కోండి... మంచివి తీసుకోండి చవక బారువి కొనకండి..." చెప్పింది.

తప్పదన్నట్లుగా డబ్బు అందుకున్నాడు రామచంద్రం.

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను... రాత్రిళ్ళు దొంగాడు తిరుగుతున్నాడుట... పక్కింట్లో డోరు కర్టెన్లు, ఎదురింట్లో చెప్పులు, ఆ చివరింట్లో మ్యాన్ హోల్ మీద మూతలు ఎత్తుకుపోతున్నాడుట." గుర్తుకు తెచ్చుకుంటూ చెప్పింది అనసూయ.

"దొంగలకు రాత్రిళ్ళు, పగళ్ళు ఏవిటి... వాళ్ళు అన్నిళ్ళ మీదా కన్నేస్తూంటారు.... నువ్వనవసరంగా పగలు తలుపుకి గొళ్ళెం పెట్టి కబుర్లు చెప్పేందుకు పక్కింటికెళ్ళకు... రోజులు బాగా లేవు. వస్తువుపోతే తిరిగి కొనుక్కునే రోజులు కాదు...." రామచంద్రం భార్యకు సలహా రూపంలో మందలించాడు.

"చెప్పులు కొనుక్కోండి... గుర్తుందిగా" ఆఫీసుకు బయలుదేరుతుంటే మరోసారి చెప్పింది అనసూయ.

సాయంత్రం యింటికి బయలుదేరేముందు, ఆఫీసుకు దగ్గర్లో వున్న అయిదారు షాపుల్లో చెప్పులు చూశాడు రామచంద్రం. ధరలు అదురుతున్నాయి. మోడల్సు వెర్రెక్కిస్తున్నాయి. ఓ వైపు అనసూయ సలహా.... మరో వైపు తాతగారి మందలింపు గుర్తుకు రాసాగాయి రామచంద్రంకి.

"హవాయి జోళ్ళు కొంటే ఖర్చు తక్కువ.... కానీ అనసూయ కోప్పడుతుంది" అనుకుంటూనే నూట పాతిక రూపాయలు పెట్టి కొన్నాడు రామచంద్రం.

ఇంటికి రాగానే భార్యామణికి చెప్పులు చూపించాడు రామచంద్రం. "ఇకపైన జాగ్రత్తగా వుండాలి" అంటూ.

"మీ ఉద్యోగులకు పనిచేయకపోయినా జీతాలు, డిఏలు, బోనస్సులు యివ్వాలి ప్రభుత్వం... వస్తువుల ధరలకు అలా ఖంగారు పడటం ఎందుకు" అంటూ కొట్టి పారేసిందామె.

సాయంత్రం ఆరు గంటలు...

"చెత్తవాడు నాలుగు రోజులు రాడట.... దిక్కుమాలిన కుక్కలు మధ్యాహ్నం యింట్లో కొచ్చి గంపలోని చెత్తను చిందర వందర చేసి పడేశాయి. ఆ చెత్త తీసుకెళ్ళి చెత్తగదిలో పడేసి రండి" అంటూ డ్యూటీ వేసింది అనసూయ.

"ఏడ్చినట్లుంది... ఆ చెత్తవాడికి ఆదివారాలు సెలవు. మధ్యలో నాలుగైదు రోజులు కుంటి సాకులతో మానేస్తుంటాడు. డబ్బులు మాత్రం ఖచ్చితంగా తీసుకుపోతాడు." అంటూ విసుక్కుంటూనే చెత్త బుట్టతో బయలుదేరాడు రామచంద్రం.

చెత్త కుప్ప మీద చెత్త పడేస్తుంటే ఆనందంతో కళ్ళు మెరిశాయి తనకి. అక్కడున్న నాలుగైదు చెప్పుల మధ్య రామచంద్రం చెప్పు కనిపించడమే! ప్రత్యేక ఆకర్షణైన మడమ భాగంలో వున్న చిల్లు అతన్ని వెక్కిరించింది.

చుట్టూ చూడకుండానే, మరేం ఆలోచించ కుండా వెంటనే తన చెప్పు అందుకున్నాడు రామచంద్రం. ఇంటికొచ్చేసి ఆ చెప్పుని సబ్బుతో శుభ్రం చేస్తుంటే వచ్చింది అనసూయ "ఏం చెస్తున్నారు" అంటూ.

రామచంద్రం ఫ్లాష్‌బాక్ చెప్పాడు.

"ఆఫీసుకు కొత్త చెప్పులు.... కాలనీలో పాత చెప్పులు వేసుకు వెళ్ళండి" ఉచిత సలహా పడేసింది భార్యామణి మనసులో మాత్రం భర్త చేసిన పనికి చిరాకు పడుతూ...

అయితే రామచంద్రం ఆలోచనలు వేరుగా ఉన్నాయి. "తనెందుకు ముందే చెత్త కుప్ప దగ్గర చూడలేదు! కుక్కలు పట్టుకెళ్ళి వుంటాయి.... తన చెప్పు అప్పుడే దొరికేది.... ఇప్పుడు అనవసరంగా నూట పాతిక రూపాయలు కొత్త చెప్పుల మీద 'బ్లాక్' అయిపోయాయి."

అందుకే కొత్త చెప్పులు గూట్లో పెట్టేసి, పాత చెప్పులతో కాలక్షేపం చేస్తున్నాడు రామచంద్రం.

- భమిడి వెంకటేశ్వర్లు

## దేనికదే!

ప్రేమ వేరు. పెళ్ళి వేరు.... మన వాళ్ళు ఈ రెండింటినీ ముడి పెడతారెందుకో అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్త పరుస్తున్నాడు పవన్‌కళ్యాన్ 'ప్రేమ' అనేది ఆకర్షణ.... పెళ్ళి అనేది ఆత్మానుబంధం. ఒక విధంగా చెప్పాలంటే..... జన్మ జన్మల బంధం. ప్రేమకీ ఒడిదుడుకులుంటాయి. పెళ్ళికి అవి వుండకూడదు. దేని దారి దానిదే! ప్రతి మనిషి జీవితంలోనూ ఈ రెండూ తప్పనిసరి. అయితే ఒకదాన్నొకటి డామినేట్ చేయకుండా జాగ్రత్త పడాలి అని చెప్తున్నాడు పవన్.

